క్లుప్తంగా

నారాయణుడికి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థనారాయణ స్వామిని ఆదివారం వివిధ ప్రాంతాల భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు బాలసుబ్రమణ్యశర్మ, సుధీర్‌కుమార్ శర్మ, సునీల్‌కుమార్ శర్మలు క్షేత్రంలోని శింగరబట్లు, గణపతి, అశ్వత్థనారాయణుడు, అభయాంజనేమ స్వామి, శ్రీవల్లి సుబ్రమణ్య, చక్రభీమలింగేశ్వర స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. కోర్కెలు నెరవేరిన భక్తులు బియ్యం బేడలతో పాటు ముడుపులు, కానుకలు, తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా క్షేత్రంలో ఎక్కువగా కుళ్లిన కొబ్బరికాయలు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు వాపోయారు. ఇదే విషయమై ఈఓ సుబ్రమణ్యంకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

కోటంకలో పూజలు



సుబ్రహ్మణ్యస్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం లో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం, ఆకుపూజ, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కసాపురం ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ నరేంద్ర కుమార్

గుంతకల్లు రూరల్: కసాపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నరేంద్ర కుమార్ ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న దుగ్గిరెడ్డి కర్నూలు జిల్లా బనగానిపల్లికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో చిత్తూరు జిల్లా, గుడియాల నుంచి బదిలీపై వచ్చిన నరేంద్ర కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

23 వరకు ఈ-క్రాప్ నమోదు

పుట్లూరు: ఈ-క్రాప్ నమోదు ఈ నెల 23 వరకూ కొనసాగుతుందని ఏఓ కాత్యాయని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 15వ తేదీతో గడువు ముగియగా ప్రభుత్వం మరో ఎనిమిది రోజులు ఈ- క్రాప్ నమోదు గడువు పొడిగించిందన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ కోసం రైతులు సమీపంలో ఉన్న వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.


స్నేహితునికి ఆర్థిక సాయం



నాగేశ్వరావుకు నగదు అందిస్తున్న మిత్రులు

పెద్దవడుగూరు: మండలంలోని జి.వెంకటాంపల్లికి చెందిన సి.నాగేశ్వరరావుకు స్నేహితులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. 1986-87లో పదో తరగతి చదువుకున్న తోటి మిత్రులు నాగేశ్వరరావు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ నడవడానికి ఇబ్బందులు పడుతున్నాడని తెలుసుకున్నారు. అందరూ కలసి రూ. 20 వేలు అందించి స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచారు. కార్యక్రమంలో నగేష్, చంద్రవర్ధన్, కొండారెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, హెచ్‌సి రంగడు, రామచంద్రారెడ్డి,సుదర్శన్‌రెడ్డి, సుంకన్న, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

చర్చీలలో ఆరాధనోత్సవం



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చీలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో క్రైస్తవులను ఉద్దేశించి పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రసంగించారు. దేవుని వల్లనే మనకు శాంతి, సమాధానం లభిస్తుందన్నారు. క్రీస్తుతోనే మనకు నిత్య ఆనందం, సంతోషం ప్రాప్తిస్తాయన్నారు. క్రీసుకు మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ధన్యకరమవుతాయన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు పాల్గొన్నారు.



వైద్య విద్యకు పెద్దపీట జగన్ ఘనతే

"దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైద్య విద్యకు పెద్దపీట వేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుంది. గత ఏడాది జగన్ ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రారంభించారు. మంత్రి సత్యకుమార్ ఈ విషయాన్ని మరిచినట్లున్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులను దూరం చేయాలనే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలని చూస్తోంది.

– ఖలీల్, గుంతకల్లు



పేదలకు వైద్య విద్య దూరం

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఫీజులు తక్కువగా ఉంటాయి. నన్ను డాక్టర్ చేయాలన్నది తల్లిదండ్రుల కల . ఇలాంటి నిర్ణయాలతో పేద, మధ్య తరగతి వారికి అన్యాయం చేయకూడదు. ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచించాలి."

– ఓబులేసు, ఇంటర్ బైపీసీ విద్యార్థి, జూనియర్ కళాశాల తాడిపత్రి



పామిడిలో జంతువుల హల్‌చల్



పామిడిలోని వీధుల్లో సంచరిస్తున్న కోతులు



పందుల స్వైర విహారం ఇలా..



కుక్కల హల్‌చల్

- కుక్కలతో తరచూ రోడ్డు ప్రమాదాలు
- ఇళ్లలోకి చొరబడుతున్న కోతులు
- భయాందోళనలో పట్టణవాసులు

పామిడి: పట్టణంలో కోతులు, కుక్కలు, పందుల బెడద అధికమవుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ వీధుల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఒక్కోసారి ఇళ్లల్లోకి దూరి దొరికిన కాడికి తిను బండారాలను ఎత్తుకెళ్తున్నాయి. ఆ సమయంలో అడ్డువచ్చిన ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. డాబా ఇళ్లపైకి ఎక్కి దూకడం, ఇళ్లలోని పెరటి మొక్కలను పీకేయడం వంటి చేష్టలతో ప్రజలు విసుగు చెందుతున్నారు.

కుక్కల స్వైర విహారం..

ఇక వీధుల్లో కుక్కల బెడద అధికమైంది. గుంపులు, గుంపులుగా వీధుల్లో సంచరిస్తున్నాయి. దీంతో వీధుల వెంట పాదచారులు, వాహనచోదకులు వెళ్లాలంటేనే భయాందోళనకు గురౌతున్నారు. వాహనచోదకులకు కుక్కలు అడ్డువచ్చి ప్రమాదాలు సైతం సంభవిస్తున్నాయి. ఇటీవలే స్థానిక 44వ నెంబర్ జాతీయ రహదారిపై రెండు నెలల వ్యవధిలో కుక్కలు ద్విచక్రవాహనాలకు అడ్డురాగా సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు చనిపోగా, 10 మంది గాయాల పాలయ్యారు. మరోవైపు పట్టణంలో పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల ప్రమాదం పొంచి ఉంది. ఇందుకు పందుల సంచారం తోడవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారుల తగిన చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఆగస్టు 29: పామిడిలోని చైతన్య కాలనీ సమీపంలో కుక్కను ద్విచక్ర వాహనం ఢీకొంది. అదే సమయంలో క్రూజర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనంలో ఉన్న అన్నదమ్ములు చిన్న (28), సాయి (26) మృతి చెందారు. ఆ ఘటనలో క్రూజర్‌లో ఉన్న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాకు చెందిన పలువురు గాయపడ్డారు.

ఆగస్టు 17: పామిడి పట్టణంలోని నాగిరెడ్డికాలనీలో ఉంటున్న ప్రైవేట్ టీచర్ చాంద్‌బాషా, పామిడి కేజీబీవీ ఉద్యోగిని షంషాద్ కుమారుడు తాకీర్ బైక్‌పై వెళ్తుండగా పొగరూరు గ్రామ సమీపాన కుక్క అడ్డురావడంతో బైక్‌ను నియంత్రించలేక రోడ్డు డివైడర్‌ను ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడు అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆగస్టు 10: పామిడి పట్టణంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై వెంగమనాయుడుకాలనీ సమీపాన కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పట్టణానికి చెందిన ప్రజాశక్తి విలేకరి వాల్మీకి గోపాల్, బేల్దారి గడ్డం నాగరాజు గాయపడ్డారు.

మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు



వై.వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

గుంతకల్లుటౌన్: ప్రేమ, సహనం, శాంతి, సామరస్యాలను బోధించిన మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని జరుపుకుంటున్న ముస్లింలకు గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త బోధనలు, సూక్తులు అనుసరణీయమని, పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆదివారం ఆయన ప్రకటన ద్వారా కోరారు.

నేడు రక్తదాన శిబిరం

గుంతకల్లుటౌన్: మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని రెడ్‌డ్రాప్ రక్తదాతల సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రహిమాన్ తెలిపారు. రక్తదాతల ద్వారా సేకరించిన రక్తాన్ని ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అజేంద్రరావును కలసి కోరారు.

17న ఆల్బెండజోల్ పంపిణీ

యాడికి: ఈ నెల 17న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు యాడికి, రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీరామ్‌కుమార్, పరమేశ్వర్, అప్పయ్య, దేవరాజన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామన్నారు.

రేషన్ బియ్యం అందక ఆకలి కేకలు



రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ ఇటీవల పట్టుబడ్డ టాటా ఏఎస్ వాహనం (ఫైల్)

పామిడి: రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు వారివి. రేషన్ బియ్యం అందితేనే కడుపు నిండే పరిస్థితులు. అలాంటి వారికి ఈ నెల కోటా బియ్యం అందకపోవడంతో ఆకలికేకలు పెడుతున్నారు. 14,17 తదితర వార్డుల్లోని రేషన్‌కార్డుదారులకు రెండు వారాలవుతున్నా బియ్యం అందలేదు. దీనిపై రేషన్‌కార్డుదారులకు సమాధానం చెప్పేవారే కరువయ్యారు. ఈ నెల కోటా, వచ్చే నెలతో కలిపి వేస్తారన్న దానిపై కూడా స్పష్టత కరువైంది. సివిల్‌సప్లై అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంపై పేదల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

గుట్టుగా అమ్ముకుంటున్నారా..?

గత బుధవారం రాత్రి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ ఓ టాటా ఏస్ వాహనం పట్టుబడింది. ఈ క్రమంలో పేదలకు రేషన్ బియ్యాన్ని అందించకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నియోజకవర్గ ప్రజాప్రతినిధికి నెలకు రూ.20 లక్షలతో పాటు ద్వితీయ స్థాయి పార్టీ శ్రేణులకు సైతం అక్రమార్కులు మామూళ్లు ముట్టజెబుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆకలిమంటను తీర్చాల్సిన అవసరమెంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు. పేదలకు రేషన్ అందకపోవడంపై పామిడి తహసీల్దార్ ఎన్.శ్రీధర్ బాబును వివరణ కోరగా ఆయన స్పందించారు. విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. మరో రేషన్ షాపు నుంచి బియ్యం వేసేలా చూస్తామన్నారు. పేదలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు.

కృష్ణారావు ఆశయాలు కొనసాగిద్దాం



వైవీకే రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

తాడిపత్రి అర్బన్: స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన వైవీ కృష్ణారావు ఆశయాలను కొనసాగిద్దామని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు డి.చిన్నప్ప యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక నెహ్రూ పార్కులో కృష్ణారావు 110వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ రైతాంగానికి ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు యాదవ్, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు రంగయ్య, సీపీఐ పట్టణ కార్యాదర్శి చిరంజీవియాదవ్, రైతు సంఘం నాయకులు ఆదినారాయణ, ఓబిరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ఉమాగౌడ్, రమణ, సీపీఐ నాయకులు రామాంజినేయులు, శ్రీనా, అబ్రహం, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' రద్దు

గార్లదిన్నె/యల్లనూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేసినట్లు గార్లదిన్నె, యల్లనూరు తహసీల్దార్లు ఈరమ్మ, నాగరాజు తెలిపారు. ఆదివారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రభుత్వ సెలవు నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేశామన్నారు. మండల ప్రజలు గమనించాలన్నారు.

20, 21న క్రీడా పోటీలు

బుక్కరాయసముద్రం: మండలంలోని బాలబాలికలకు క్రీడా సమాఖ్య (స్కూల్ గేమ్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో అండర్–14, 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు నవీద, లింగా నాయక్ తెలిపారు. 20న సిద్ధరాంపురం జెడ్పీ హైస్కూల్ మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్ పోటీలు, 21న బీకేఎస్ మండల కేంద్రంలోని ఆర్డీటీ మైదానంలో బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో పనిచేయాలి



గుంతకల్లులో విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ భవాని, లైసెన్సుడ్ సర్వేయర్లు



గుంతకల్లులో ఇంజినీర్ గుర్రప్పను సన్మానిస్తున్న దృశ్యం



తాడిపత్రిలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు



ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలలో రషీద్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

- ఘనంగా ఇంజనీర్స్ డే

గుంతకల్లుటౌన్/గుంతకల్లు/తాడిపత్రి అర్బన్/బుక్కరాయసముద్రం: దేశం గర్వించదగ్గ గొప్ప ఇంజినీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని, ఆయన స్ఫూర్తితో పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని సూచించారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్సుడ్ టెక్నికల్ పర్సన్స్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య విగ్రహానికి చైర్‌పర్సన్ పూలమాల వేసి నివాళులర్పించారు. తాగు,సాగు నీటి ప్రాజక్టులతో నవభారత నిర్మాణానికి సేవలు అందించిన గొప్ప ఇంజనీర్ విశ్వేశ్వరయ్య అని ఆమె కొనియాడారు. అనంతరం ఇంజనీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈ గురప్పయాదవ్, ఏసీపీ సత్తార్, టీపీఎస్ మురళి, లైసెన్సుడ్ సర్వేయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రాము, టీడీపీ నాయకుడు నారాయణ స్వామి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, కౌన్సిలర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు. అలాగే రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డేఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఏసీపీ సత్తార్, టీపీఎస్ మురళిని సన్మానించారు. రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శివానంద, శ్రీనివాసులు, రొటరాక్ట్ జిల్లా ప్రతినిధి కర్నాటకం నాగార్జున తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణ జేవీవీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఇంజనీర్స్ డేలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుర్రప్పను ఘనంగా సత్కారించారు కార్యక్రమంలో జేవీవీ నాయకులు గంగరాజు, హరిప్రసాద్, భారత రాజ్యాంగ అవగాహన వేదిక నాయకుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

- తాడిపత్రి పట్టణంలోని టీచర్స్‌కాలనీలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవన్‌లో ఇంజనీర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్ రెడ్డి ,రిటైర్డ్ ఇంజనీర్లు, పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.
- బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం, ఎన్‌డీఎల్ఐ క్లబ్, ఐసీఐ సహకారంతో ఇంజినీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘణంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్ట్రక్చరల్ డిజైన్ ఇంజినీరు రషీద్ అహ్మద్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువులతో పాటు పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం మోక్షగుండం విశ్వేరయ్య ఇంజినీరింగ్‌లో చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ డాక్టర్ వెంకటరెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ హరి ప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థుల పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గార్లదిన్నె: శాంతిభద్రతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మర్తాడు, కల్లూరు గ్రామాలకకు చెందిన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సాహించిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించే వారిపై నిఘా ఉంచామన్నారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీ షీట్ తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

జూదరుల అరెస్టు

యాడికి: మండల కేంద్రంలోని కోన రోడ్డులో పేకాట స్థావరంపై సీఐ తన సిబ్బందితో దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు.

రేపటి నుంచి 'స్వచ్ఛతా హీ సేవ'

బుక్కరాయసముద్రం: మండలంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 1 వరకూ నిర్వహించే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీఓ తేజోత్స్న ఆదివారం తెలిపారు. పంచాయతీల్లో స్వచ్ఛత భాగిదారీ, సంపూర్ణ స్వచ్ఛత, సఫాయి మిత్ర సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అధికారులు హాజరు కావాలన్నారు.

ఒకరికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని కనంపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. అనంతపురానికి చెందిన మహమ్మద్ బాషా పామిడి నుంచి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా.. కాకరకాయలు లోడ్‌తో వెళ్తున్న ఆటో రాంగ్ రూట్‌లో ఎదురుగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఘటనలో మహమ్మద్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సీతారాం ఏచూరికి నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

యాడికి: మండల కేంద్రంలోని వేములపాడు రహదారిలో సీపీఐ మండల కార్యదర్శి మహమ్మద్ రఫి నివాసంలో ఆదివారం సీపీఐ, సీపీఎం నాయకులు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరికి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ, సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఆయన మృతి బాధాకరమన్నారు. ఆయన ఆశయ సాధనాల కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, రాముడు, రజాక్,చౌడయ్య, రామయ్య, సాంబశివుడు, రాఘవ, ఆదినారాయణ రెడ్డి, మోహన్, బషీర్ రబ్బాని, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో 2000 సంవత్సరం విద్యార్థులు



రైల్వే హైస్కూల్‌లో పాల్గొన్న విద్యార్థులు

గుంతకల్లు: పట్టణంలోని రోటరీ హైస్కూల్ 2000లో పదో తరగతి చదవిన విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం తోపాటు కుటుంబ క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అప్పటి గురువులు ప్రకాష్, ఎండీ రఫీక్, జాకీర్, శ్రీనివాసులు, శశికళ, హేమలత, మంగళ, మాధురి, కేజియా, జానకమ్మ తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్గనైజ్ కమిటీ సభ్యులు నాగ సంతోష్, మహేష్, యూసుఫ్, అతూఫ్, ఆస్మిత్, నాగశక్తి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే హైస్కూల్‌లో..

స్థానిక రైల్వే హైస్కూల్ 2006లో పదో తరగతి చదివిన విద్యార్థులు గెట్ టూ గెదర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో చేసి అల్లర్లును నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎండీ గౌస్, ఆలీ, సత్య, భరత్, హరిబాబు, రషీద్, అబ్దుల్, కార్తీక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్కజాంపల్లి సమీపంలో చిరుతల సంచారం

- రైతుల బెంబేలు

పామిడి: మండలంలోని అక్కజాంపల్లి సమీపంలో మూడు రోజుల క్రితం రెండు పర్యాయాలు పొలాలకు వెళ్లిన రైతులకు రెండు చిరుతలు కనిపించాయి. రైతులు కేకలు వేయండంతో రెండు చిరుతలు అక్కడ నుంచి పుల్లేటి వంకలోకి పరారయ్యాయి. అక్కడే మరుసటి రోజు అవే చిరుతలు మళ్లీ కనిపించాయి. దీంతో అక్కజాంపల్లితో పాటు రామరాజుపల్లి, ఎదురూరు గ్రామాల రైతులు పొలాలకు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. కూలి పనులకు వెళ్లేందుకు కూలీలు సైతం వెనుకంజవేస్తున్నారు. చిరుతల సంచారంతో అటవీశాఖాధికారులు తక్షణం స్పందించి చిరుతల బెడద నుంచి కాపాడాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

సీఐని కలసిన లయన్స్ క్లబ్ సభ్యులు

పామిడి: పామిడి పోలీస్‌స్టేషన్‌లో సీఐ యుగంధర్‌ను పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో ఆ క్లబ్ సభ్యులు ఆదివారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా వారు సీఐకి పూల బొకే ఇచ్చి అభినందనలు తెలుపుతూ స్వాగతించారు. కార్యక్రమంలో ఆ క్లబ్ సభ్యులు డాక్టర్ శాంతి, జయరామ్ రావు తదితరులు పాల్గొన్నారు.